క్లుప్తంగా

ప్రజలకు 'బలసాని' సంక్రాంతి శుభాకాంక్షలు



గుంటూరు రూరల్: సంక్రాంతి పండుగ ప్రతి ఒక్కరి ఇళ్లల్లో సంతోషాలను నింపాలని నియోజకవర్గంలోని ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ తెలిపారు. నియోజకవర్గంలోని ప్రజలకు భోగి, సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల జీవితాల్లో సంక్రాంతి వెలుగులు నింపాలని ఆకాంక్షించారు.

కనులపండువగా పుట్టలమ్మతల్లి సంబరాలు



గుంటూరు రూరల్: నల్లపాడు చల్లావారిపాలెం గ్రామ ప్రజల ఇలవేల్పు దేవత పుట్టలమ్మతల్లి ఘంటాలమ్మతల్లి ఆలయ సంక్రాంతి సంబరాలు కనుల పండుగగా జరుగుతున్నాయి. రెండవ రోజు కార్యక్రమంలో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమార్చనలు, హోమాలను నిర్వహించారు. సాయంత్రం కార్యక్రమంలో భాగంగా ఆలయంలో వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఉత్సవ ఊరేగింపు రథానికి కొబ్బరికాయలు కొట్టి పూజించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు సాదర స్వాగతం పలికి శాలువాలు కప్పి, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. సమన్వయకర్త మాట్లాడుతూ అమ్మవారి కృప కటాక్షాలు ప్రజలకు ఎల్లప్పుడూ ఉండాలని ప్రజలంతా సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. నియోజకవర్గ ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. అమ్మవారి ఊరేగింపు ఆసాంతం కనుల పండువగా సాగింది. ఆలయ కమిటీ చైర్మన్ ఇంటూరి అంజిరెడ్డి మాట్లాడుతూ సోమవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం శ్రీ లక్ష్మీనరసింహ మహిళా కోలాట బృందం కోలాటం, 8 గంటలకు అమ్మవారి వద్ద ప్రత్యేక పూజలందుకున్న 9 కిలోల లడ్డూ వేలం జరుగుతుందని తెలిపారు. లడ్డూను వేలంలో పాడుకున్న భక్తులకు 9 గ్రాముల బంగారు అమ్మవారి లాకెట్‌ను ఇంటూరి వీరారెడ్డి, రాజశేఖర్‌రెడ్డిలు అందజేయనున్నారన్నారు. 100 అడుగుల ఎలక్ట్రిక్ ప్రభ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. భక్తులు కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

సందడిగా భోగి పండుగ

- మార్కెట్లకు సంక్రాంతి శోభ
- కిటకిటలాడిన దుకాణాలు



నారాకోడూరు సెయింట్ మేరీస్ కళాశాలలో భోగి మంటల వద్ద విద్యార్థినుల సందడి



పొన్నూరులో కిటకిటలాడుతున్న దుకాణాలు



పొన్నూరు ప్రధాన సెంటర్‌లో చెరుకు గడల విక్రయాలు



పెద్దివారిపాలెంలో భోగి మంటలు వేస్తున్న యువకులు

పొన్నూరు: పట్టణంలో భోగి సంబరాలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామునే ప్రతి ఒక్కరూ తమ ఇంటి ముంగిట, ప్రభుత్వ కార్యాలయాలు, దుకాణ సముదాయాల వద్ద భోగి మంటలు వేసి ఉత్సాహంగా గడిపారు. తెలుగువారి పెద్ద పండుగ సంక్రాంతి పురస్కరించుకుని ఆదివారం పొన్నూరు మార్కెట సెంటర్‌లో సంక్రాంతి శోభను సంతరించుకుంది. మండలంలోని వివిధ గ్రామాల నుంచి నిత్యావసర సరుకులు, పూజా సామగ్రి, పూలు, వివిధ వస్తు సామగ్రి కొనుగోలుకు వచ్చిన ప్రజలతో దుకాణాలు కిటకిటలాడాయి. ప్రధాన రోడ్లలోని వస్త్ర దుకాణాలు, కిరాణ షాపులు, సూపర్ మార్కెట్లు జనంతో కిక్కిరిసిపోయాయి. సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ప్రజలు అన్ని ఏర్పాట్లును పూర్తి చేసుకున్నారు.

సెయింట్ మేరీస్‌లో...

చేబ్రోలు: చేబ్రోలు మండలం నారాకోడూరులోని సెయింట్ మేరీస్ గ్రూప్ విద్యాసంస్థలలో ఆదివారం భోగి వేడుకలు ఘనంగా జరిగాయి. పదవ ఆంధ్రా గార్ల్స్ బెటాలియన్ ఎన్‌సీసీ తొమ్మిది రోజుల శిక్షణా కార్యక్రమం సెయింట్ మేరీస్ కళాశాలలో జరుగుతున్నాయి. గుంటూరు జోన్ పరిధిలోని 313మంది విద్యార్థులు వివిధ అంశాలలో శిక్షణ పొందుతున్నారు. ఆదివారం భోగి పండుగ సందర్భంగా కళాశాల విద్యార్థులు, ఎన్‌సీసీ విద్యార్థులు భోగి మంటలు వేసి, ఉత్సాహంగా వేడుకలు జరిపారు. విద్యార్థులు పాటలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కళాశాల క్యాంపస్ ఇంచార్జి యు.శ్రీకాంత్, ప్రిన్సిపాల్ సీహెచ్ సుకేష్ కుమార్, ఎన్‌సీసీ కల్నల్, క్యాంప్ ప్రతినిధులు పాల్గొన్నారు.

భోగభాగ్యాల భోగి..

కాకుమాను: భోగిళ్లా..భోగిళ్లో భోగ భాగ్యాల భోగిళ్లో అంటు వాడ వాడలా మండల ప్రజలు భక్తి శ్రద్ధలతో భోగి పర్వదినాన్ని నిర్వహించారు. ఎప్పుడెప్పుడు పండుగ ఏడాది పండుగ అంటు పెద్ద పండుగ కోసం సేకరించిన కలప, తాటి, వెదురు బొంగులు, పిడకలను తీసుకొచ్చిన యువత తమ వీధి కూడళ్లలోకి చేర్చి భోగి మంటలు వేశారు. సంక్రాంతి పండుగలో భోగి పండుగ తొలి ఘట్టం. చిమ్మ చీకట్లను చీల్చుకుంటు వెలుగులు నింపే భోగి మంటలు పాతకు స్వస్తి పలికి కొత్తదనానికి నాంది పలుకుతుందని నమ్మకం. భోగి మంటల్లో నీళ్లు వేడిచేసి తెల్లవారక ముందే తలార స్నానం చేసి కొత్త దుస్తులు ధరించడం అనాదిగా వస్తున్న ఆనవాయితీ. చుట్టుపక్కల చిన్నారులు, తమ ఇంటిలోని చిన్నారులపై భోగిపళ్లు పోసే కార్యక్రమం ఇంటింటా వేడుకగా నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాలలో భోగి పండుగను సంతోషంగా నిర్వహించుకున్నారు.

టీడీపీ కోవర్టులు మళ్లీ ఆ గూటికే..

కొందరి నాయకుల వైఖరిపై వైఎస్సార్ సీపీ నాయకుల మండిపాటు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

పొన్నూరు: టీడీపీ కోవర్టులుగా వ్యవహరించి వైఎస్సార్ సీపీలో ప్రాధాన్యం కోల్పోయిన పలువురు నాయకుల వ్యవహార శైలిపై నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు మండిపడ్డారు. ఆదివారం వైఎస్సార్ సీపీ పట్టణ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. మార్కెట్ యార్డు చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ టీడీపీ కోవర్టులు మళ్లీ ఆ గూటికే వెళ్లడంతో పార్టీకి పట్టిన దారిద్ర్యం వీడిందని అన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో వారికి అనుకూలంగా ఉంటూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరి ధూళిపాళ్లకు అనుంగు అనుచరులైన నిడుబ్రోలు నాయకులను మొదట్లోనే కనిపెట్టిన ఎమ్మెల్యే రోశయ్య వారికి తగిన ప్రాధాన్యం ఇవ్వలేదన్నారు. టీడీపీ ముసుగులో ఉన్న నాయకులు పొన్నూరులో వైఎస్సార్ సీపీని బలహీన పరిచే విధంగా చూపించేందుకు పసుపు కండువాలు కప్పుకున్నట్లుగా చేసిన డ్రామాలను ప్రజలు గమనించారని మండిపడ్డారు. రానున్న ఎన్నికలలో పొన్నూరు గడ్డపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండా మరోసారి రెపరెపలాడుతుందని తెలిపారు. సమావేశంలో నిడుబ్రోలు పీఏసీఎస్ నన్నపనేని వీరయ్య చౌదరి, పార్టీ పట్టణ, రూరల్ అధ్యక్షులు మహమ్మద్, రుద్రపాటి ఆదిశేషులు, పట్టణ బీసీ అధ్యక్షులు కొల్లేరు శ్రీనివాసరావు, గేరా సంజీవ్, పలగాని రమేష్, ఏతాటి వసంతరావు, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు పంపిణీ

నగరంపాలెం: ప్రతి ఒక్కరూ వృద్ధులను, దివ్యాంగులను ఆదరించాలని శ్రీ హనుమాన్ ఆదర్శ సేవా సమితి అధ్యక్షుడు మామడి మురళీకృష్ణ అన్నారు. ఆదివారం కొత్తపేటలోని సమితి కార్యాలయంలో వంద మంది వయో వృద్ధులు, దివ్యాంగులకు ఉచితంగా బియ్యం, పది రకాల నిత్యావసర వస్తువుల కిట్లు, దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మామిడి మురళీకృష్ణ మాట్లాడుతూ సమాజంలో అనేక మంది వృద్ధులు ఎటువంటి ఆదరణ లేక జీవిస్తున్నారని, అటువంటి వారికి తమ వంతుగా సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో పూర్వ అధ్యక్షుడు నేరెళ్ల కొండలరావు, ఇస్కాన్ దేవాలయం ప్రతినిధి వీరగోవింద ప్రభూజీ, సభ్యులు మాదాల ప్రకాష్, పలకలూరి శివరావు, పోలేపల్లి వెంకటసుబ్రమణ్యం, ఎస్‌వీ రమణ, టి.మురళీసాయి, అరుణకుమారి, పోలేపల్లి హరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నిత్య సహాయమాత మహోత్సవం



నిత్య సహాయమాత మహోత్సవంలో మాట్లాడుతున్న సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్

గుంటూరు రూరల్: నిత్య సహాయమాత ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ అంది ప్రజలంతా సంతోషంగా జీవించాలని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ తెలిపారు. ఆదివారం నల్లపాడు గ్రామంలోని నిత్యసహాయమాత ఆలయ పండుగ మహోత్సవానికి సమన్వయకర్త ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్థానికంగా ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా స్థానికంగా ఉన్న లూథరన్ దేవాలయంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం నిత్య సహాయ మాత ఆలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బలసాని మాట్లాడుతూ ప్రజలంతా నూతన సంవత్సరంలో సంతోషంగా ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. నిత్య సహాయమాత చర్చిలో ఇలా పండుగ మహోత్సవాలు జరుపుకోవటం సంతోషకరమన్నారు. గ్రామ ప్రజలంతా సమష్టిగా ఏర్పడి పండుగను జరుపుకోవటం బాగుందని సంఘ పెద్దలను అభినందించారు. సంఘ పెద్దలు బలసానిని ఘనంగా శాలువాలు కప్పి సన్మానించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా సమన్వయకర్త మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనను ఆశీర్వదించి ప్రత్తిపాడు నియోజకవర్గం సమన్వయకర్తగా పంపారని చెప్పారు. నియోజకవర్గంలోని ప్రజలు తమను ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. ఎప్పుడు ఎటువంటి సమస్య ఎదురైనా నేరుగా తనను సంప్రదించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నల్లపాడు డివిజన్ కన్వీనర్ దుగ్గెంపూడి యోగేశ్వర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నడవ వీరయ్య, ఆర్‌అండ్‌బీ కార్పొరేషన్ డైరెక్టర్ పిల్లి మేరి, లక్కిరెడ్డి మనోహర్‌రెడ్డి, కందుకూరి జ్యోతి, శానం చిన్నప్ప, దాసరి రవి, దాసరి నాగరాజు, గొట్టిముక్కల నాగరాజు, గుంటూరు కుటుంబరావు, గుంటూరు దావీదు, నాగరాజు, భాస్కర్, గోపి, ఆర్‌సీఎం చర్చి సంఘ పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

అయోధ్యరాముని అక్షింతల పంపిణీ



అక్షింతలతో శోభాయాత్ర నిర్వహిస్తున్న పసులేటి శివ

పొన్నూరు: అయోధ్యరాముని అక్షంతలు, స్వర్శ పంపిణీ కార్యక్రమం శ్రీరామ మందిరం ధర్మకర్తలు చైర్మన్ పసులేటి శివ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. పొన్నూరు, నిడుబ్రోలులో అక్షంతల కలశంతో ప్రధాన వీధుల్లో శోభాయాత్ర శ్రీరామ నామస్మరణతో జరిగింది. భక్తులు కలశాన్ని తమ తలపై ధరించి స్వామివారి ఆశీస్సులు పొందారు. అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ట దినం భారతీయులందరికీ పండుగ రోజు అని, ప్రతిష్ట ఆహ్వానం, రాములవారి అక్షంత ప్రసాదాన్ని పట్టణంలో ప్రతి కుటుంబానికి చేరుస్తున్నామని శివ తెలిపారు. వివిధ ప్రాంతాల ప్రజలు అందరి ఇళ్లకు చేర్చేందుకు అక్షింతలను తీసుకుని వెళ్లారు. ఆవుల సంఘం చలపతిరావు, బండారు శ్రీను, బావిరెడ్డి బ్రహ్మం, బావిరెడ్డి సుబ్బారావు, గద్దే రత్తయ్య, దాసరి రమేష్, తాడిశెట్టి గోపీరాజు, మహిళలు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలు



వైద్యశాలకు తరలిస్తున్న 108 సిబ్బంది

చేబ్రోలు: ప్రమాదవశాత్తూ ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీ కొట్టడంతో ముగ్గురు యువకులకు గాయాలైన సంఘటన మండల కేంద్రమైన చేబ్రోలులోని సినిమాహాలు ప్రాంతం వద్ద ఆదివారం జరిగింది. పొన్నూరు రూరల్ మండలం బ్రాహ్మణకోడూరు గ్రామానికి చెందిన యువకులు ఎ.అనీల్, కె.అనీల్, జయవర్ధన్‌లు ద్విచక్ర వాహనంపై చేబ్రోలుకు బయలుదేరారు. మార్గమధ్యలో చేబ్రోలు సినిమా హాలు సమీపంలో పొన్నూరు వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వీరి బైక్‌ను ఢీ కొట్టింది. ఈఘటనలో ముగ్గురు యవకులకు కాళ్లు విరగటంతో పాటు, తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనం ద్వారా గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా గోదాదేవి కల్యాణోత్సవం



ప్రత్యేక అలంకారంలో చేబ్రోలు రాజ్యలక్ష్మి అమ్మవారు



పుష్పాలంకరణలో దర్శనమిస్తున్న గోదాదేవి, రాజ్యలక్ష్మి అమ్మవార్లు



రంగనాథస్వామి దేవస్థానంలో గోదాదేవి శాంతి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

చేబ్రోలు: చేబ్రోలు మండలంలో వివిధ గ్రామాల్లో గోదాదేవి కల్యాణోత్సావాలు ఆదివారం అత్యంత వైభవంగా కనుల పండువగా ఘనంగా జరిగాయి. స్థానిక రంగనాథస్వామి దేవాలయంలో గోదాదేవి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం సుప్రభాత సేవ, సహస్రనామార్చన, శ్రీ పుష్పయాగం, చతుర్వేద పారాయణం, విశేషపూజా కార్యక్రమాలు నిర్వహించారు. గోదాదేవి కల్యాణోత్సవం చేబ్రోలు, శ్రీరంగపురం, శలపాడు, మంచాల గ్రామాల్లోని దేవాలయాల్లో కన్నుల పండుగగా జరిగింది. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. చేబ్రోలులోని రంగనాథ స్వామి దేవస్థానంలో జరిగిన కల్యాణోత్సవంలో పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ధనుర్మాసం విశిష్టత, వైభవం గురించి వివరించారు. పుష్పయాగంలో 18 రకాల గులాబీలతో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. చారిత్రక ప్రసిద్ధి చెందిన శ్రీరంగపురంలోని మోహన రంగనాయక స్వామి దేవస్థానంలోను, మంచాలలోని వేణుగోపాల స్వామి దేవస్థానంలో, శలపాడు వేణుగోపాలస్వామి దేవస్థానం, వడ్లమూడి, వేజండ్ల, శేకూరు గ్రామాల్లోని దేవస్థానాల్లో దనుర్మాసం సందర్భంగా గోదాదేవి కల్యాణోత్సవం ఘనంగా జరిగాయి. నారాకోడూరులోని పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానం వద్ద గోదాదేవి కల్యాణోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కర్పూర జ్యోతి దర్శనం



అయ్యప్పస్వామి దేవస్థానానికి మేళతాళాలతో తరలివెళ్తున్న భక్తులు

పెదకాకాని: హరిహరసుతుడు అయ్యప్పస్వామికి భక్తులు అభిషేక పూజలు, కర్పూర హారతులు అందించి భక్తి శ్రద్ధలను చాటుకున్నారు. పెదకాకాని మండలం వెనిగండ్ల గ్రామంలోని అయ్యప్పస్వామి ఆలయంలో ఆదివారం భోగి పర్వదినం పురస్కరించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్పస్వామి ఆలయ 9వ వార్షికోత్సవం, శబరిమల అయ్యప్పస్వామి సన్నిధిలో మకరజ్యోతి దర్శనం సందర్భంగా స్వామివారికి అభిషేక పూజలు చేశారు. గుంటూరుకు చెందిన పద్మజ జ్యూయలర్స్ యజమాని భూషా చంద్రారెడ్డి స్వామివారి అలంకరణకు ఆభరణాలు తయారు చేయించి సమర్పించటంతో పాటు ప్రతి ఏటా 21 కిలోల కర్పూరాన్ని అందజేస్తున్నారు. ప్రతి ఏటా స్వామి వారికి అలంకరించే ఆభరణాలు, మకర జ్యోతిగా వెలిగించే కర్పూరాలను తీసుకుని మాకిరెడ్డి వెంకటరెడ్డి గురుస్వామి ఇంటి నుంచి మేళతాళాలతో గ్రామోత్సవంగా బయలుదేరి ఆలయానికి చేరుకుంటారు. గురుస్వామి పర్యవేక్షణలో సాయంత్రం ఆభరణాలతో పాటు ఆలయంలో హారతులు, కర్పూరు జ్యోతి వెలిగించేందుకు దాతలు అందజేసిన కర్పూరం, దీపాలతో ఆలయానికి చేరుకున్నారు. అర్చకస్వామి శక్తి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం అయ్యప్పస్వామి వారి 18మెట్లకు పూజలు చేసి కర్పూర జ్యోతిని వెలిగించారు. అయ్యప్పస్వామి శరణుగోష, పాటలు, జ్యోతి దర్శనంతో భక్తులు తన్మయత్వం చెందారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అ'పూర్వ' కలయిక

19 సంవత్సరాల తర్వాత కలుసుకున్న స్నేహితులు



నాటి, నేటి గురువులతో 2004- 05 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు

పెదనందిపాడు: పాఠశాల పూర్వ స్నేహితులంతా ఒక్కచోట చేరారు. ఆ సంతోషం, ఆ ఉద్వేగం.. చెప్పతరమా అలనాటి జ్ఞాపకాలు నేమరువేసుకున్నారు. అప్పట్లో పాఠశాలలో చేసిన అల్లరి పనులను గుర్తు చేసుకున్నారు. ఒకరినొకరూ ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఆదివారం ఉదయం మండల పరిధిలోని అన్నవరప్పాడు కేఎస్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల కలయిక జరిగింది. పాఠశాలలో 2004-05 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు ఒక్కచోట సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తమ అభ్యున్నతికి మార్గం చూపిన గురువులు బి.సత్యం, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, రమణకుమారి, ఉమామహేశ్వరిలను వారంతా కలిసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం చంద్రశేఖర్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేత

గుంటూరు రూరల్: పండుగలు మన సంస్కృతి సాంప్రదాయాలను భావితరాలకు తెలియజేస్తాయని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గం సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ తెలిపారు. ఆదివారం సంక్రాంతి సంబరాల్లో భాగంగా 40వ డివిజన్ జన్మభూమినగర్‌లో స్థానిక కార్పొరేటర్ ఏరువ సాంబిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సంక్రాంతి ముగ్గుల పోటీలకు సమన్వయకర్త ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగ తెలుగు ప్రజలకు పెద్ద పండుగని తెలిపారు. అనంతరం ముగ్గుల పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తురకపాలెంలో క్రికెట్ పోటీలు..

క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని క్రీడాకారులు నైపుణ్యతలు మెరుగు దిద్దుకునే దిశగా కృషిచేయాలని ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ తెలిపారు. ఆదివారం తురకపాలెం గ్రామంలో డాక్టర్ అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో జరిగిన క్రికెట్ మ్యాచ్ విజేతలకు బహుమతులు అందజేత కార్యక్రమంలో ఆయన పాల్గొని, విజేతలకు బహుమతులు అందజేశారు. గ్రామ సర్పంచ్ డబ్బూరి సూర్యప్రకాశరావు, మిర్చియార్డు డైరెక్టర్ ఇంద్ర, ఆర్ అండ్‌బీ కార్పొరేషన్ డైరెక్టర్ పిల్లి మేరి, 40వ డివిజన్ కార్పొరేటర్ ఏరువ సాంబిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాలు జబర్దస్త్



నెహ్రూనగర్ : నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో గుంటూరు ఎన్టీఆర్ స్టేడియంలో జరుగుతున్న సంక్రాంతి సంబరాల్లో ఆదివారం రాత్రి జబర్దస్త్ బృంద సభ్యులు సందడి చేశారు. సాయంత్రం 6 గంటల నుంచి చిన్నారుల కూచిపూడి, భరత నాట్యాలు, జుంబా డ్యాన్స్‌తో ప్రజలను అలరించారు. అనంతరం జబర్దస్త్ ఇమ్మానియేల్ చేసిన ఆనందో బ్రహ్మ కామెడీ, వెంకీ మంకీ టాకింగ్ డాల్, ఆనంద్ చే మిమిక్రీ, హాస్యవల్లరి, శాంతి స్వరూప్ ఆట పాట కామెడీ టానిక్ వంటి కార్యక్రమాలు నగరవాసులను ఆకట్టుకున్నాయి.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT SANGAREDDY
O.S.No. 514 of 2020

Between:
Mullapudi Ananda Rao. ...Plaintiff
AND
Kondakal Vinod Reddy & others. ...Defendants

To,
Nallapaneni Madhuri W/o. Shiva Kumar, aged 40 years, Occ: Design Engineer, R/o. H.No.10-1-78, Near PAS College, Pedda Nandipadu Village, Guntur District, A.P. ...Defendant No.3

Whereas, the plaintiff filed the suit vide O.S.No.514 of 2020 against you and others on the file of the Hon'ble Principal Junior Civil Judge at Sangareddy for declaration of title and consequential injunction in respect of the suit schedule plots and the said suit is now stands posted on 24-01-2024 for your appearance.

Hence, you are hereby informed to appear before the Hon'ble Principal Junior Civil Judge at Sangareddy on 24-01-2024 at 10.30 a.m., either in person or through counsel, failing which, the matter will be decided ex parte as per law.

//By order of the Court//
P. VINOD REDDY
Advocate
Sangareddy District

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT SANGAREDDY
I.A.No. 1232 of 2020
IN
O.S.No. 514 of 2020

BETWEEN:-
Mullapudi Ananda Rao. ...Petitioner/Plaintiff
AND
Kondakal Vinod Reddy others. ...Respondents/Defendants

To,
Nallapaneni Madhuri W/o. Shiva Kumar, aged 40 years, Occ: Design Engineer, R/o. H.No.10-1-78,Near PAS College, Pedda Nandipadu Village, Guntur District, A.P. ...Respondent/Defendant No.3

Whereas, the petitioner/plaintiff filed the suit vide O.S.No.514 of 2020 against you and others on the file of the Hon'ble Principal Junior Civil Judge at Sangareddy for declaration of title and consequential injunction in respect of the suit schedule plots along with I. A.No.1232 of 2020 for interim injunction and the said I.A.is now stands posted on 24-01-2024 for your appearance.
Hence, you are hereby informed to appear before the Hon'ble Principal Junior Civil Judge at Sangareddy on 24-01-2024 at 10.30 a.m., either in person or through counsel, failing which, the matter will be decided ex parte as per law.

(By order of the Court)
P. VINOD REDDY, Advocate
Sangareddy District.